# పంచయతి నెంబరు

శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి

[ఏడుకోసులుదాటితే వాడుక మారుతుంది–అన్నది పంజాబీనానుడి. మనిషి మనిషిని బట్టి, మాట మారుతుందన్నా ఆశ్చర్యంలేదు. కాని, నైసర్గిక పరిస్థితులనిబట్టి, ఆచార వ్యవహారాలనుబట్టి కొన్ని ఏసలు, మార్పులు కలుగుతాయి. ఇవే మాండలికాలకు మాతృకలు.

ప్రతిమండలం, ప్రతివర్గం వాడే భాషలో రచనలు సాగినప్పుడే వాఙ్మయం పరిపుష్టమవుతుంది. ఇది కరీంనగరం జిల్లాలోని ఒక వర్గం భాషలో సాగిన రచన.

—సంపాదకుడు.]

పొద్దటాల సెప్రాసొచ్చి సందెటాల పంచాయితుండదంటని సెప్పిపోయినప్పటిసంది మన్సుల మన్సు లేదు. గిన్నిసార్లు రచ్చకట్టమీదికి వోయిన గనీ ఇయాల్ల వోనీకే మన్సొప్తలేదు. వద్దాంటిని బతిమాలుకుంటి... గద్ద[1] పట్కొని అడుక్కుంటి గాని ఇనకపోయిరి. మాదిగోల్లంటెని, మాలోల్లంటని, సెప్పకో గూడదంటని పంచయతి కమీటాల నన్నుగూడ్క నెంబరు సేస్కున్నరు. నాకేం తెలుస్తది. నేను పసురుకుణ్ణోణ్ణి! మాదిగోణ్ణి. నాదిగూడ్క ఓబతుకా? నా నీడ వడ్తే తానం జేస్తరు మంది. కుక్కకున్నంత సుకంగూడ్క లేదు నాకు. దాన్ని సంకనవెట్కొని బువ్వ దింటరు. మాకు ఊరి బైటనే ఇండ్లు. ఇయాల రేపు సూస్తొంగ దొరోల్లంత గూడి మాకు ఎకెరే[2] గట్టిస్తున్నరు. మాలమాదిగోల్లంత దేవుని బిడ్డలంటని గాందిమారాజు సెప్పిండంట. అందురు మావెంట బడ్డరు. యాడాదికోసారి మా గేర్లల్లకొచ్చి ఊప్పోతరు దొరోల్లు. మల్లి వోల్లింటికి వోతే దూరమే నిలవడాలె. గదేందో పంచయతీ గూడ్క మాదిగోల్లను తీస్కోవాలంటని కానూన్[3] జేసిరంట. యారిగాడు పెద్ద మంచి; వోన్ని నెంబరు[4] జేయుమంటని ఊర్ల కినా మందన్నరంట. ఓట్ల పెట్టెలు వెట్టిరు. నా డబ్బమీద గుర్తు వెట్టిరు. ఎన్నికలంట. నా డబ్బల నే యేయ్యక పోతే పీకవోతదంటని నా డబ్బలె యాయ్యక ఇంగోనిడబ్బ లేసినకాని నేనే నెంబరైనంటని తాసిల్దారు సెప్పి పాయె. గిదేనంట మనరాజ్యం.

పంచయితి అయినకాడినుంచి యీయ్యారి సంగతే మారిపోయింది. నిత్తె యాదన్నొక జగడమొస్తది. వోల్లేమొ బాగ తిన్నుకోని మాతాని కొస్తరు. మేం జెప్తే ఇన్నట్టేజేసి మల్ల తిండ్లాడుకుంటరు. పని లేదు పాటలేదు.

సెప్పులు కుట్టనీక కూసోంగనే మంత్రొచ్చిండని ఓసారి, తాల్కదా[5]రొచ్చిండని ఓసారి, సబ[6] జేస్తరంటని ఓసారి, జగడం బెట్టుకున్నరంటని ఓసారి, పిల్సుకపోతరు. అడికివోతే ఏముంటది? నేను మాట్లాడంగనే అంసరు నక్తగు.

మొన్న కరణమయ్య పిల్చి, "ఏంరా! ఈరిగా! ఊరిపెద్దల్ల గలసినవు. చెప్పులు దెస్తలేవు. ఎన్నివొద్దు[7] లాయె సెప్పి. నాయకుడవైన"వంటని తిట్టిండు. అవ్వ! తిట్తడు. తిట్టకేం జేస్తడు? యాబై ఏండ్లొచ్చె. నన్నెవడు తిట్టలే. కాని ఇయాల్ల తిట్టబడాల్సొచ్చె. ఏడేడు మీద పడుతుంటొద్ది మన్ని సక్కపడాలెగాని గిదేంది?

ఊల్లె చందాలేసి మా గేర్ల గాందిమారాజు బొమ్మ నిలవెట్టిరు. ఆ బొమ్మకింద పిల్లలంత గలీజు

1. గడ్డము. 2. వాడ, సందు (కన్నడం గేరి నుండి). 3. చట్టము. 4. మెంబరు అనుటకు అపభ్రంశము. 5. కలెక్టరు. 6. సభ. 7. ప్రొద్దులు—దినములు (ఈనాడు కొందరు 'రోజులు' అని వాడుతున్నారు.)

చేస్తరు. గుడ్డా గాండ్లు8 బాగకట్ట9 ఆడుకుంటరు. ఆ చండాల సంగతి నాకు దెలవదు గాని నేను సూస్తంగ ఆ చండాలు తినోళ్లెవ్వల్ల ఉండవంటని సెత్తిన నోరు వెట్టుకొని అరుస్తున్నరు మంది. నాకేం దెలుసు? మాల మనోళ్ణి. అంటర్లకిచ్చి కోతికొయ్యక్కం జేస్తుంటరు. మొన్న తాలూకా దారొచ్చి పంచయతి నెంబరుంటే తాన, గాంధిబొమ్మ వానగిల్లోవుతుంటె దంటని తిట్టి పోయిండంట. నేను ఊర్ల లేను, ఉన్నింటే మొగం మీననె తిట్టిపోతుండె. నన్ను నెంబరు జెయ్యకమునుపు మా కులమోల్లంత పెద్దమన్షి అంటుండ్రి, ఇప్పుడు వోల్లుగూడక నన్నుజూసి "దొరోల్ల జతన కలసోని మనోల్లను దెబ్బతీస్తుండు మన కులంపెద్ద." అంటుండరు. గుడ్డు, గుడ్గాని దొర్కపోతే దొర్కపాయెగాని మన్సు నొచ్చేటట్లు మాట్లాడ్తే పైమీన తేల్లు జెర్లు పాకినట్లైతది. నా అంజలి సేను సాగి బత్కుతుంటే. ఎవరిపీస లేకుండె సోల్ల ఏమైనా నన్నే తిట్టరు. మొన్న పట్నంకెల్లి ఒగాయనొచ్చి దొరోల్లింటికాడ సూసోని 'మాదిగోల్ల సూడక ఊరిపెద్దైలి నాంక ఇంగేముంటది? సర్కారుకు బుద్ధిలేదు. పసులచేతి కిచ్చిన్రు ఊరి'నంట నన్నడు. పంచయితీల నాపక్కకే సూసునే దొర ముసిముసి నవ్వులు నవ్వతుండడు. అదె! పసులంటె అంగుట్ల తాను లేడా ఎట్ల? "మాకేం దెల్సునబ్బ! మీ అసుంటోల్లొచ్చి మా గేర్లూడుస్తరు. 10పోట్లుతీసుకోని అగ్బర్లల్ల11ఏస్తరు. మల్ల మమ్మల్నే దిట్తరు." అంటె దైర్నంజేసి. కొత్తగొచ్చినయ్య "ఊకో! ఊకో! ఎక్కతిక్క మాట్లాడకు. నీకు తీగ్రం కానుం డట్టుండది. పెద్దపెద్ద మాటలు నీకెంటికి?" అన్నడు, దొర నేమో "పెల్లిచ్చినప్పుడు రా. ఇంక ఇంటికిపో" అంట నన్నడు.

గాంధిమా రాజు మాదిగోల్లకు శనా జేసిండంట. సేస్తే సేసిండుగనీ, నా బత్కు అగుడు12 జేసిండు.

ఇయాల్ల నేను పోయి తీర్పు సెప్పాలంట. బాపనయ్య కొడుకులు కొట్లాడిన్రంట. మనూరికి వినోబ మారాజొచ్చినప్పుడు ఆయనపక్కన కూసోని "ఆస మనల్నను సెడగొడ్తది. ఎక్కవపొలం ఏంటికి? ఒక్క గుంట పొలమైన దానంజేసి పుణ్యంగట్టుకోండి. బత్కు శనాకాలం ఉండదు. వినోబామారాజుకు నాబత్కంత దానంజేసిన. ఇంక నాకు కావాల్సిందిఏమిలేదు"అంటని కండ్లుమూసుకోని మాట్లాడిన అయ్యగారే ఇయాల్ల పొద్దువోద్దంగనే, అన్నను గొట్టిన్రంట. అమ్మను నాయనను తిడేటట్లు గట్టుకొని గుడిముంగట మాతాన ఇంగేమి లేదంటని సెప్పమని గొట్టిన్రంట. గదేంది? మాతిమీన మీసమున్న మొగోడు తాను సంపాయిచు కోవాలెగాని పెద్దలవేంటికి దినాలె? తనపాలు తనకు గావాల్నంటని జగడం సురూ13 జేసిండంట. మాదిగోన్నైన, సగువున్నోనైనను, బాపనయ్యకు బుద్ధి జెప్పనీకె పోవాలొచ్చింది. సెప్పేమాటల సేసే పన పొత్తే కుదరకపాయె. ఊల్ల ఉండిపోకపోతే బాగుంటది.

సిన్నాయన సొత్తంమునిపి. పాలు పంచుకున్నాక మల్ల ఎందో పాలంటని పెట్టిండు. తినింట కెవరన్నాస్తే అన్న ఇంట్ల దించిపోతడు. ఇంక అన్నం గిట్ల అన్నే పెట్టాలె. ఏం బాపనయ్యగద! వినోబ ముంగట అర్రకాలి స్తనంటని వొప్పుకున్న సిన్నయ్య తర్వాతియ్యలే. నాకు రెండెక్రాలిచ్చిన్రు భూదానమోల్లు. భూములిస్తనంటని వినోబ ముంగల అనోల్లు శనాసంది భూమియ్యలె. కొందరేమో జగడాలున్న భూములిచ్చిన్రు. కొందరేమో రాల్లు తుప్పలు ఉన్న భూములిచ్చిన్రు ముసలి ముతక ఆవును దానం జేసినట్లు.

నేనేమొ దొరికిన రెండెక్రాలు ఇంగోనికిచ్చి సేతులు దులుపుకున్న. లేనోడు దానంజేసిండంటని అగ్బార్లల్ల రాసిన్రంట. నాతాన్కి ఎక్కడెక్కడోల్లొచ్చి నాకు తెలియని బాసల అడిగిన్రు.14 సాలె పంతులుండెడు. గాయన వోల్లందరికి తెలిసెటట్లు సెప్పిండు. కొన్ని రోజులయ్యాక నా బొమ్మ అగ్బార్లల్ల పడ్డది. ఆ మాల్ల ఊరిమొంతంత నన్ను కడ్డేలుగును15 సూసినట్లు సూడనీకొచ్చిన్రు.

ఆ బాపనయ్యకు బుద్ధిజెప్పనీకె వోవాలంట. ఏంకాలం వచ్చెగద. ఇక వోత. పోకపోతే ఎట్ల?

---

8. పనిలేని పెద్దలు. 9. గవ్వలాట. 10. ఫోటోలు. 11. వార్తాపత్రిక. 12 అల్లరి. 13. ప్రారంభము. 14. బడిపంతులు. 15 ఎలుగుబంటు.